క్లుప్తంగా

అలరించిన వీడ్కోలు

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రడాపు మధుసూదన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈఎస్ఐని వెంటనే జమ చేయాలి

ఎదులాపురం: ఆదిలాబాద్ మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు సంబంధించి ఈఎస్ఐ డబ్బులను కార్మికుల ఖాతాలో జమ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆదిలాబాద్ కార్మికులతో కలిసి హైదరాబాద్‌లో శుక్రవారం ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ జి.గాంగ్టేకు వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ మున్సిపల్‌లో పని చేస్తున్న కార్మికులకు సంబంధిత వెంకటేశ్వర రూరల్, అర్బన్ వెల్ఫేర్ సొసైటీలు ఈఎస్ఐ డబ్బులు జమ చేయడం లేదని ఆరోపించారు. విచారణ జరిపించి కార్మికులకు న్యాయం చేయాలని ఈఎస్ఐ ఆర్డీని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు జనగం రాజమల్లు, అగ్గిమల్ల స్వామి, నగేశ్, జనార్దన్, బొజ్జ ఊశన్న పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సర్ఫారాజ్ అన్నారు. శుక్రవారం మావల మండల కేంద్రంలోని వెల్‌నెస్ సెంటర్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్నారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వైద్యుల సూచనల మేరకు మాత్రలు వేసుకోవాలని సూచించారు. అలాగే గర్భిణుల రక్త నమూనాలు సేకరించి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీపీసీసీ మాజీ ఇన్‌చార్జిని కలిసిన నాయకులు

కైలాస్‌నగర్: టీపీసీసీ మాజీ ఇన్‌చార్జి మాణిక్ ఠాక్రేను జిల్లా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.

జిల్లా జైలులో నాటుకోళ్ల విక్రయాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా జైలులో నాటుకోళ్ల విక్రయాలు జరుపుతున్నట్లు జైలు సూపరింటెండెంట్ అశోక్ తెలిపారు. ఇదివరకు రెండు బ్యాచ్‌ల కోళ్లు విక్రయించగా.. మూడో బ్యాచ్ కోళ్లను విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పాలకూర, దాణా, మునగాకును వాటికి తినిపిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. జైలు ఆవరణలో క్రయ విక్రయాలు జరుపుతున్నామని, అవసరమైన వారు కొనుగోలు చేయాలని కోరారు.

సీఆర్‌టీల వేతనాలు విడుదల చేయాలి

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్‌టీ (కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్) వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఈశ్రు శుక్రవారం డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న సీఆర్‌టీలకు నాలుగు నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సీఆర్‌టీల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని అధికారులను కోరారు.

పరుగుపందెం పోటీలు

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులకు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ వెండి సోమేశ్వర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తున్నాం'

ఎదులాపురం: కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. అరవింద్ కేజ్రీవాల్ రెండు సార్లు ఢిల్లీ గద్దెనెక్కారని, నిన్న కాక మొన్న పంజాబ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేశారని అన్నారు. ప్రజాదరణ చూసి ఓర్వలేకే కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు పాల్పడ్డారని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, గణేశ్, మహబూబ్ ఖాన్, సీపీఐ నాయకులు అరుణ్‌కుమార్, కుంటాల రాములు పాల్గొన్నారు.

పంట నష్టం సర్వే ప్రారంభం

- ఆదిలాబాద్ రూరల్‌లో 7వేల ఎకరాలకు పైగా యాసంగి సాగు
- వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలు

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల మండలంలో ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వానకు పంటలు నేల కొరిగాయి. మరికొద్ది రోజుల్లో కోతకు వచ్చే జొన్న, తదితర పంటలు నేలకొరగడం తో కొంత మంది అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. యాసంగిలో సాగు చేసి వర్షానికి దెబ్బతిన్న పంటలపై సర్వే చేసి ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నలు కోరారు. దీంతో స్పందించిన సర్కార్ ఎకరాకు రూ. 10వేల నష్ట పరిహారం అందించి రైతన్నలకు అండగా ఉంటామని ప్రకటించింది. దీంతో వ్యవసాయ అధికారులు రైతుల వారీగా సర్వే చేపట్టి నష్ట తీవ్రతపై నివేదికలు సిద్ధం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ఏఈవోలు (వ్యవసాయ విస్తరణ అధికారులు) శుక్రవారం నుంచి పల్లెల్లో క్షేత్రస్థాయిలో పంట పొలాలోకి తిరిగి సర్వే చేపడుతున్నారు. గతంలో మాదిరిగా కూర్చున చోట రచ్చబండ వద్ద, ఫోన్‌ల ద్వారా సమాచారం తెలుసుకొని రాస్తే అన్నదాతలు నష్టపోయే అవకాశం ఉంది. పక్కాగా నిర్వహిస్తేనే ప్రయోజనం దక్కుతుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

యాసంగి సాగు ఇలా..

ఈఏడాది యాసంగిలో మండలంలో సుమారు 7,452 ఎకరాలలో పంటలు సాగవుతున్నాయి. ఇందులో జొన్న 7,200 ఎకరాలు, వేరుశనగ 120 ఎకరాలు, మక్క 62 ఎకరాలు, గోధుమలు 40 ఎకరాలు, నువ్వులు 30 ఎకరాలలో సాగవుతున్నట్లు వ్యవసాయాధికారుల రికార్డులు చెబుతున్నాయి. ముందస్తు సాగు చేస్తే చలి వాతావరణంతో పంటల దిగుబడులు తగ్గటం, వాతావరణ పరిస్థితులు అనుకూలించక సాగు చేస్తే కూలీల కొరత, భూగర్భ జలాలు అడుగంటి సాగునీరు అందక పోవటం వీటి నుంచి గెట్టెక్కినా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు పడే బాధలు వర్ణనాతీతం. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకోని కొంత మంది రైతులు నవంబర్ మాసంలోనే ముందస్తు సాగు విధానాన్ని ఎంచుకున్నారు. అలాంటి వారిపై వడగళ్ల వాన ప్రభావం ఉందని వ్యవసాయాధికారులు అంటున్నారు. మరికొన్ని రోజులు ప్రకృతి కరుణిస్తే రైతులు యాసంగి సాగు నుంచి గట్టెక్కే అవకాశం ఉందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి అష్రఫ్‌ను ‘సాక్షి’ ఫోన్‌లో సంప్రదించగా ఇటీవల కురిసిన అకాల వర్షానికి మండలంలో వందలోపు ఎకరాలలోనే నష్టం ఉంటుందన్నారు. నష్టపోయిన పంటను అంచనా వేసేందుకు ఏఈవోలు క్షేత్రస్థాయికి వెళ్లి నష్టపోయిన పంటలపై అంచనా వేయనున్నారు.


యాపల్‌గూడ శివారులో రైతులతో కలిసి జొన్న పంటను పరిశీలిస్తున్న ఏఈవో

12డి ఫారం పంపిణీ

- ఆదిలాబాద్ రూరల్‌లో 553, మావలలో 355 మంది గుర్తింపు

ఆదిలాబాద్‌రూరల్: ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి నుంచి ఓటుహక్కు వినియోగించుకునేందుకు ముందుగా 12 డి ఫారం పంపిణీ చేస్తున్నారు. ఇలాంటి వారికి ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. ఇదిలా ఉండగా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 80 ఏళ్లపైబడి వయస్సు కలిగిన వారికి 12 డి ఫారాన్ని అందజేశారు. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో ఆ వయస్సు పరిమితిని 85 ఏళ్లకు పెంచింది. అలాగే 40 శాతానికిపైగా వైకల్యాం ఉన్న దివ్యాంగులకు సైతం 12 డి ఫారం అందజేశారు. మూడు రోజుల కిందట ఆదిలాబాద్ రూరల్, మావల మండలలో పరిధిలో గల బీఎల్‌వోల ద్వారా వాటిని పంపిణీ చేశారు.

85 ఏళ్లకుపైబడిన వారు, దివ్యాంగులు ఇలా..

ఆదిలాబాద్ రూరల్ మండలంలో 48 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఇందులో మహిళలు 17,637 మంది ఓటర్లు, పురుషులు 16,599, ఇతరులు 2 ఓటర్లు ఉన్నారు. 85 ఏళ్లకుపైబడిన ఓటర్లు 96 మంది, దివ్యాంగులు 457 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో 29 మంది ఇంటి వద్ద నుంచి వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. మావల మండలంలో 41 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. మహిళ ఓటర్లు 19,329 మంది, పురుషులు 18,352, ఇతరులు 1 ఉన్నారు. ఇందులో 85 ఏళ్లపైబడిన ఓటర్లు 103 మంది, దివ్యాంగులు 252 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గత ఎన్నికల్లో 80 ఏళ్లకుపై వయస్సు కలిగిన 31 మంది, దివ్యాంగులు 23 మంది ఇంటి వద్ద నుంచి వారి ఓటుహక్కు వినియోగించుకున్నారు.


కచికంటిలో 12 డి ఫారాన్ని వృద్ధురాలికి అందజేస్తున్న బీఎల్‌వో

వారి ఆసక్తి మేరకు

85 ఏళ్లపైబడి వయస్సు కలిగిన, అంగవైకల్యాం ఉన్న దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటుహక్కు వినియోగించుకోలేని స్థితిలో ఉన్నవారికి ముందుగా 12 డి ఫారం అందజేశాం. వీటిని గత మూడు రోజుల కిందట సంబంధిత బీఎల్‌వోల ద్వారా వారికి ఇచ్చాం. 12 డి ద్వారా దరఖాస్తు చేసుకుంటే వారి ఆసక్తి మేరకు ఇంటి వద్దనే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

– దిలీప్ కుమార్, తహసీల్దార్, ఆదిలాబాద్ రూరల్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆదిలాబాద్: ఆధ్యాత్మిక మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో శ్రీఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంప్రోక్షణ, యజ్ఞం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. యువత హనుమంతుడి ఆరాధించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

బేల: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. శుక్రవారం మండలంలోని సాంగిడి గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మించుకున్న ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జ్యోతిరెడ్డి, కదరపు ప్రవీణ్, దత్తా నిక్కమ్, ఠాక్రే మురళీధర్, రామెల్లి మోరేశ్వర్, బోనిగిరివార్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి


పూజలు చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: పెద్దమ్మతల్లి ఆశీస్సులు బోథ్ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరుకున్నారు. శుక్రవారం మండలంలోని కౌఠ(బి) గ్రామంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణిలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, రుక్మణ్ సింగ్, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావనను అలవర్చుకోవాలి

బోథ్: ప్రతిఒక్కరూ భక్తి భావనను అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కనుగుట్ట గ్రామంలో శబరి మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆలయాలను నిర్మించడం వల్ల భక్తి భావన పెరుగుతుందన్నారు. శబరిమాత ఆశీస్సులు బోథ్ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, సురేందర్, ఎలుక రాజు, స్వామి, ప్రవీణ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నేరడిగొండ: జిల్లా ముదిరాజ్ సంఘం సభ్యులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఘనంగా సన్మానించారు. శుక్రవారం నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో సంఘం సభ్యులు ఉన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

బేల: సూపర్‌వైజర్‌లు, బూత్ లెవల్ అధికారులు ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నియమ నిబంధనలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తుది ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన వారి నుంచి ఓటరు నమోదు కోసం ఫారం -6దరఖాస్తు తీసుకోవాలని సూచించారు. ఒక్కరి ఓటు, తుది ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సవాయిసింగ్‌ను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావు, సూపర్‌వైజర్‌లు గీత, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్

కాంగ్రెస్‌లో చేరికలు

జైనథ్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలకు ఆకర్షితులైన భారీ ఎత్తున నాయకులు కాంగ్రెస్‌లోకి చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారని ఆదిలాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మేడిగూడ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు తుడుం రాములు ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు స్థానికులు కంది శ్రీనివాస రెడ్డికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, తుమ్మల వెంకట్ రెడ్డి, గిమ్మ సంతోష్, బాయిన్‌వార్ గంగారెడ్డి, మంచికట్ల ఆశమ్మ, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్‌లోకి ఐహెచ్ఆర్‌వో రాష్ట్ర కో ఆర్డినేటర్

బోథ్: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (ఐహెచ్ఆర్‌వో) రాష్ట్ర కో ఆర్డినేటర్ గజ్జల శ్రీనివాస్ ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పేదల అభివృద్ధి కాంగ్రెస్ ద్వారానే సాధ్యమన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బోథ్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024– 2025 విద్యా సంవత్సరానికి 6 నుంచి 9వ తరగతిలో మిగిలిన సీట్ల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల సమయం శనివారంతో ముగుస్తుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు కొత్తపల్లి మహేందర్ యువసేన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహేందర్ తల్లి దండ్రులు, అన్నయ్య జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలోని గంగన్నపేటలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించి తా గునీటిని అందజేశారు. కార్యక్రమంలో రాధాబాయి, రవికాంత్, మనోహర్, రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో భారత్ రైస్

నేరడిగొండ: కేంద్ర ప్రభుత్వం పేదలకు చౌకగా బియ్యం అందించాలనే ఉద్దేశంతో రూ.29 లకే కిలో బియ్యాన్ని అందిస్తోంది. ఈ బియ్యం నేరడిగొండలో అందుబాటులో ఉన్నట్లు నేరడిగొండ కిరాణా అండ్ జనరల్ మర్చంట్ సభ్యులు ముక్క శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. బియ్యం కావాల్సిన వారు ఆధార్ జిరాక్స్ తీసుకొచ్చి 10 కిలోల బ్యాగును తీసుకువెళ్లాలని కోరారు. ఒకరికి ఒక నెలలో 50 కిలోలు మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్: పరమహంస సద్గురు పూలాజీ బాబా పాట్నాపూర్ సంస్థాన్ ఆదిలాబాద్ ధ్యాన మందిరం నిర్మాణ కమిటీని గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సతీష్, ప్రధాన కార్యదర్శిగా సుకుమార్ పెట్కులే, గౌరవ అధ్యక్షుడిగా జాదవ్ సోనేసింగ్, ఉపాధ్యక్షుడిగా మానాల లింగన్న, కోశాధికారిగా శెడ్కే దత్తులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సలహా సంఘం సభ్యులుగా ప్రేమ్, రాజు, జ్ఞానేశ్వర్, కార్యదర్శిగా గేడం విట్టల్, రాథోడ్ సంతోష్ లను ఎన్నుకున్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలో ఇప్పటి వరకు 2వేల పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుబ్బ, ఇచ్చోడతండాలో పశువులకు కుంటు నివారణ టీకాలు వేశారు. ప్రభుత్వం ద్వారా ప్రతిఏటా ముందుస్తు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శేఖర్, దేవురావులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన పాల శంకర్ కూతురి వివాహానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై నూతన వదువరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ బోథ్ మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు తదితరులు ఉన్నారు.

నాగోబా ఆలయంలో ఆత్రం సక్కు పూజలు

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు శుక్రవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు శాలువాతో సన్మానించారు. ఎంపీగా విజయం సాధిస్తే నాగోబా ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ పూజరి మెస్రం శుకు, మెస్రం వంశీయులు మెస్రం నాగ్‌నాథ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఆత్రం సక్కు

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు ఎం.రమణరెడ్డి, వినోద్ రెడ్డి, భావణసింగ్ తెలిపారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, క్రీడా కార్యదర్శి పోస్టులకు పోటీ నెలకొందన్నారు. ఈనెల 18 నుంచి 20 వరకు నామినేషన్లను స్వీకరించారు. ఆదిలాబాద్ బార్ అసోసియేషన్‌లో 171 మంది ఓటర్లుగా ఉన్నారు. ఈనెల 28న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎన్నికలు జరుగనున్నాయి. అనంతరం ఫలితాలను వెల్లడించనున్నట్లుగా పేర్కొన్నారు. అయితే అధ్యక్ష పదవికి 3 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుత అధ్యక్షుడు ఎన్.నగేశ్ మరోసారి అధ్యక్ష బరిలో నిలువగా, బిపిన్ కుమార్ పాటిల్, మేకల మధుకర్‌లు అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. ఉపాధ్యక్ష పదవికి చంద్రకాంత్ చౌదరి, కల్లెం ప్రవీణ్ రెడ్డి, రజిత రెడ్డి నామినేషన్లు వేశారు. ప్రధాన కార్యదర్శి పదవికి చందుసింగ్, వై.సంజయ్ రెడ్డి, సంతోష్ కుమార్‌లు నామినేషన్లు వేశారు. క్రీడా కార్యదర్శి పదవికి మజీద్ హుస్సేన్, ఉమేష్ రావు డోలే పోటీ పడుతున్నారు. సంయుక్త కార్యదర్శిగా రాహుల్ వాగ్మారే, కోశాధికారిగా కొర్రి రమణయ్య, మహిళ ప్రతినిధిగా తిలోత్తమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీ, రాంనగర్, తదితర కాలనీలోని ప్రధాన వీధులగుండా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎలాంటి సమస్య తలెత్తిన జిల్లా పోలీసులతో పాటు, కేంద్ర బలగాలు ప్రజలకు అండగా ఉంటాయన్నారు. ఫ్లాగ్‌మార్చ్‌లో ఆదిలాబాద్ రూరల్, ట్రాఫిక్ సీఐలు ఫణిధర్, ప్రణయ్, ఎస్సైలు విష్ణువర్ధన్, ముజాహిద్, సీఆర్పీఎఫ్ బలగాలు పాల్గొన్నారు.


ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న డీఎస్పీ, సీఐ

ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్

జైనథ్: ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ జాబితా సవరణ పూర్తి చేయాలని ఆర్డీవో వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడ్రస్‌ల మార్పు, ఓటరు జాబితా నుంచి పేర్ల తొలగింపు, కొత్త ఓటర్లను చేర్చడం ఏప్రిల్ 15లోగా పూర్తి చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ శ్యాంసుందర్, డీటీ రాజేశ్వరి, ఆర్ఐ నితిన్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్ కుమార్

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ సుశీల్ బర్డ్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదు, ఓటుహక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులచే ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, లెక్చరర్లు ప్రతాప్‌సింగ్, అశోక్, విద్యార్థుల పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

ఆదిలాబాద్‌రూరల్: వేసవిలో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి తాగునీటిని పరీక్షించే క్లోరోస్కోప్ కిట్‌లను పంపిణీ చేశారు. నీటిని ఎలా పరీక్షించాలో అధికారులు పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'దివ్యాంగులను కించపరిస్తే చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగుల ప్రయోజనాలను దుర్వినియోగం చేసే వారిని, కించపరిచే వారిపై చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సలీమ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలంకు వినతి పత్రం అందజేశారు. దివ్యాంగుల చట్టం 2016 సెక్షన్ 92 పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. చట్టాలపై జిల్లా అధికారులకు, దివ్యాంగులకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి సురేశ్, రాజశేఖర్, సూర్యకాంత్, సుకుమార్ పాల్గొన్నారు.